# నేనూ (అ)ప్రయోజకుణ్ణే సుమా!

అసలు బజారు చెయ్యడమంటేనే నాకు తగని భయం. అందుకు కారణం ఆ విషయంలో అనుభవం లేకపోవడమే. బజారు చెయ్యడంలో అనుభవం ఏమిటాని మీ రాశ్చర్యపోవచ్చును. మా తాతగారి దగ్గర చదువుకునే రోజుల్లో చెప్పేవారు--బజారు కెడితే బేరం ఎలా చెయ్యాలో, సరుకు ఎలా నాణెం చెయ్యాలో ఏ సరుకన్నా కొనేముందు వాడు చెప్పిన ధరలో సగానికి అడగాలట అప్పుడు వాడు నసిగి నసిగి చివరకు మనం అడిగిన ధరకు కొంచెం ఎక్కువ చేసి యిస్తాడట. ఇక సరుకు చూసేటప్పుడు నిక్కచ్చి మొహమాటం లేకుండా మరీ చూసి తీసికోవాలనేవారు. వంకాయలు కొంటున్నామనుకోండి వంకాయలకు ముచ్చికలు పెద్దదిగా వుండాలిట. కాయ ఎప్పుడు కోశారో ముచ్చిక చూసి గ్రహించాలట.. ఏమేమో యిలా చెప్పేవారు. ఆఖరికి నిత్యం వాడుకునే వెదురు వేళ్ల విసనకర్ర క్కూడా జాగ్రత్తగా పరిశీలించాలనే వారు. వెదురు మంచిదో కాదో, దగ్గర దగ్గరగా అల్లిక ఉందో లేదో...

సోమంచి రామం

యివన్నీ తల్చుకుంటే నాకు బజారు కెళ్లి సరుకులు తేవడమంటే చాల భయంగా పరిణమించింది. అందుకని అయినదానికి, కాని దానికి ఆ బంట్రోతునే పంపి సరుకులు తెప్పిస్తానని ఆవిడగారికి ఎక్కడలేని ఆగ్రహమూ నా మీద! వాడైతే ఓ బేరం సారం చెయ్యడట. పైగా ప్రతిసారి ఓ అర్థో పావలో కమీషన్ కొట్టొంటాడట. యివీ ఆవిడగారి అంటే మా శ్రీమతివారి వాదనలు. ఏమైతేనేం బేరం చేసి తెద్దాములే అని అనుకున్నాను మనసులో!

ఆవేళ ఆదివారం. సాయంత్రం బజారు కెళ్ళి ఏదేనా బేరంచేసి అమాంతం మా శ్రీమతిని ఆశ్చర్యానందాల్లో ముంచిపారెయ్యాలనే సంకల్పంతో బజారు బయలుదేరాను. బంట్రోతు కూడ ఉంటేనే ఎక్కడ బేరం చేసేటప్పుడు గ్రంథం చెడుతుందోనని వాడ్ని యింటి దగ్గరే ఉండమని బయలుదేరాను. గబ గబ బజారు చేరా నన్నమాటే గాని అసలు ఏం కొనుక్కెళ్ళాలో తోచలేదు. 'ఇన్ని సామాన్లు తెప్పిస్తున్నారు. ఎవరేనా వస్తే కూర్చోమనేందుకు ఇంత చాప ముక్కేనా లేదు కొంవలో' అంటూ సాధించే మా శ్రీమతి మాటలు జ్ఞప్తికొచ్చాయి. సరే చాప కొనాలని ఎదురుగా కనిపించిన కొట్లో కెళ్ళాను. ఇంకా చేరానో లేదో 'రండి సార్! రండి' అంటూ ఏదో పెద్ద పరిచయమున్న వాడిలా ఆహ్వానించాడు. అతను చూపిన బల్లమీద కూర్చుంటూ, 'చాపలున్నాయా?' అన్నాను. 'లేకేం సార్! ఎన్ని అడుగుల్ది కావాలి!' అంటూ ప్రశ్నించాడు. నాకు మతి పోయింది! ఈ వివరాలన్నీ నాకేం తెలుస్తాయి? అయినా హుందాగా 'అసలు సరుకు చూడనియ్యవోయ్!' అన్నాను.

'దానికేం చూడండి సార్!' అంటూ రెండు మూడు రకాలు చూపించాడు.

'ఈ చాప ఎంత?' అన్నాను అందులో మధ్యరకం చూపిస్తూ.

'వన్ టువల్వ్ సార్!' అన్నాడు బొత్తిగా తెలుగు భాష మర్చిపోయినట్టు!

వెంటనే చిన్నదనంలో మా తాతగారు చేసిన బోధలు జ్ఞప్తికొచ్చాయి. వాటిని అక్షరాలా ఆచరణలో పెట్టే అవకాశం లభించినందుకు ఎంతో ఆనందించి చచ్చి స్వర్గాన్ని ఉన్న ఆయనకు అభినందనలు తెల్పాను మనస్సులో!

'అంతేనా! యింకేమన్నా బేర ముందోయ్!' అన్నాను.

'అబ్బే! బేరాల్లేవు సార్! అందరిలాగ ఎక్కువ ధర చెప్పి బేరం చేయించుకుని తక్కువ కమ్మే బేరం కాదండి మాది! మీ కిష్టమైతేనే కొనండి! ధరలో తేడా వుంటే వూరికేనే యిస్తాను. కావాలంటే వాకబు చేసుకోండి' అంటూ వ్యాపార ధోరణిలో చిన్న ఉపన్యాసం దంచాడు.

'చూడు ఏమన్నా వీలవుతుందేమో' అంటూ లేచిపోబోయాను బెట్టుసరిగా! బేరం పోతుందన్న భయం చేతనే తగ్గిస్తాడేమోనని.

ఈ కథ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 25-6-1958 సంచికలో ప్రచురితమైంది

'దమ్మిడీ తగ్గదండి!' అన్నాడు యీసారి నిక్కచ్చిగా నిష్కర్షగా!

'సరే! మళ్ళీ ఎన్ని కొట్లు తిరుగుతాను! ఒకటి కట్టి యియ్యి' అంటూ డబ్బు చెల్లించి చాప పుచ్చుకుని కొట్లోంచి బైటకొచ్చాను. ఇల్లు చూస్తే అంతా చేసి అరనై గజాలుండదు. ఈ ఒక్క చాపకోసం రిక్షా పిలనా అని అనుకుని మన సరుకు మనమే తీసికెడుతున్నాంగా అనే 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' దృష్టిలో పెట్టుకుని చాప చంకలో పెట్టుకుని గృహోన్ముఖుడనయ్యాను. కొట్టు దాటి పదడుగులు వేశానో లేదో పండు ముసలాయన ఎదురువచ్చాడు.

'ఎంత క్కొన్నావు బాబూ! చాప!' అంటూ ఆప్యాయంగా అడిగాడు.

మరొకరైతే ఏం చేసేవాడినో కాని ముసలి తాత గౌరవంగా అడిగాడు కదా అని ధర చెప్పాను.

'బాగుంది బాబూ!' అంటూ వెళ్ళిపోయాక తాత నా వినయ విధేయతల్ని మెచ్చుకుంటున్నట్లుగా!

అమ్మయ్య! అనుకుంటూ మరో పది గజాలు సాగానో లేదో ఎదురుగా ఒకాయన వస్తూ దగ్గరకు రాగానే ఎగాదిగా చూస్తూ నన్ను దాటిపోయారు.

'బ్రతికాం రా బాబూ!' అనుకుంటూ అడుగు ముందుకేశాను.

'ఏమండోయ్! మిమ్మల్నే! ఒకసారి ఆగండి' అంటూ వెనకనుంచి ఎవరో కేకేశారు యింతట్లోనే నన్నేనేమోనని వెనక్కి తిరిగాను. నన్నే. యింకా అనుమానమెందుకు!

'మిమ్మల్నే! ఆగండి' అంటూ యింతక్రితమే ఎగాదిగా చూసి దాటిపోయిన ఆ

అపరిచిత వ్యక్తి గబ గబ అంగలేసికొంటూ దగ్గరకొస్తున్నాడు. దొంగేమోనన్న అనుమానంతో పోలీసు ఆపు చేసినట్లు ఆపు చేశాడు.

'ఈ చాప ఎంతకొన్నారు?' అంటూ చేతిలో చాప లాక్కుని రోడ్డుమీదే విప్పి చూడసాగాడు.

పెళ్ళుమని చెంప పగిలేటట్టు కొడదామన్నంత కోపం వచ్చింది కాని యింతలో రయ్‌మంటూ బస్సు వచ్చేసింది.

'ఇలా పక్కన విలబడదాం రండి!' అంటూ రోడ్డు పక్క పేవ్‌మెంట్ మీదకు లాక్కెళ్ళాడు.

'ఎంతన్నారు! ఈ చాప?' తిరిగి అదే ప్రశ్న!

'రూపాయి ముప్పావలా!' ముక్తసరిగా సమాధానం చెప్పాను కొంచెం విసుగుతో!

'ఇంతకన్న చిన్న సైజు ఉండవండీ!' అన్నాడు నేనేదో చాపల వ్యాపారం చేస్తున్నట్టు!

'ఏమిటయ్యా! నేనేం షావుకార్ననుకున్నావా' అని గట్టిగా అడుగుదామనుకున్నాగాని పోనీ ఏదో పల్లెటూరివాడిలా ఉన్నాడులే అని 'ఉండవచ్చు' అన్నాను.

'ఎక్కడ కొన్నారు మీరు దీన్ని?' అంటూ అసలు రంగంలోకి దింపాడు. ఇక నా ప్రాణం తీస్తాడేమోనని భయమేసి.

'అదిగో! ఎదురుగా కనబడ్డంలేదూ! బిళ్ళల కొట్టు. దాని పక్కన ఫాన్సీ షాప్ లేదూ! దాంట్లో. వెళ్ళి మీకు కావాల్సిన సైజు ధర పెట్టి కొనుక్కోండి!' అన్నాను మళ్ళీ ఎదురు ప్రశ్న వేయకుండా!

'సరే! అయితే వెళ్ళండి!' అంటూ రివ్వున తిరిగిపోయాడా వ్యక్తి. ఇక నాకు వెళ్ళడానికి అనుమతి నిస్తూ!

ఆ వ్యక్తి వెళ్ళగానే చాప పుచ్చుకుని బయలుదేరాను. మళ్ళీ ఎవరు ఎదురు తగుల్తారోనని. పిలిచి చాప అతనికిచ్చి యింటికి పంపేశాను. యింకా అది కూడా ఉంటే ప్రజానీకం చాలా ప్రమాదాలు తెచ్చేటట్టుందని!

అలా అలా తిరిగి తిరిగి యింటికి చేరేసరికి ఏడయింది! రేడియో వార్తలు చెప్తోంది! కాళ్ళు కడుక్కుని ఆకలిగా ఉందని భోజనానికి కూర్చున్నాను.

'చూశావా! చాపో చాపో అంటూ ఒకటే గోల చేశావు! దెబ్బతో తెచ్చాను!' అన్నాను అక్కడికి నేనేదో మహా ఘన కార్యం చేసినట్లుగా!

'అయ్యో! సొడభ్యం! చాలు! ఆలికి అన్నం పెట్టడం కూడ వూరికి ఉపకారమే అన్నాట్ట వెనకటికి ఎవడో అలాగ మీ కొంపలోకి చాప తెచ్చుకోవడం కూడ గొప్పేనా?' అంది మా శ్రీమతి.

'మనం సొంతంగా బేరం చేసి తెచ్చాం తెలుసా! అదీ చెప్పేది' అన్నాను. ఈసారి అసలు ఘనకార్యం వెల్లడి చేస్తున్నట్లు!

'ఎంత?' అని అడిగింది!

'రూపాయి ముప్పావలా! అంటే నూట డెబ్బై ఐదు నయా పైసలు అన్నాను గొప్పగా!'

'ఎంతా? రూపాయి ముప్పావలా! ఎందుకూ! శుద్ధ దండగ! రూపాయి పావలాట!' అంది.

'ఓసి వెర్రి మొహమా! మనక్కాబట్టి రూపాయి ముప్పావలాకేనా యిచ్చారు. మరొకళ్ళయితే రెండు రూపాయలు తెలుసా!' అన్నాను నా ప్రయోజకత్వం చూశావాన్నట్లు పోజిస్తూ!

'చాల్లెండి! వాడెవరో మీకు మా బాగా టోపీ వేశాడు! ఈ చాప రూపాయి పావలా! అంతకన్న ఎక్కువైతే దండగే! పక్క వాటా సుందరమ్మగారు చెప్పలేదూ! వాళ్ళింట్లో మొన్నే తెచ్చారుట! రూపాయి పావలాకి!' అంటూ ఘాటుగా చెప్పేసింది!

'అది దీనికన్న చిన్నదై వుంటుందిలే!' అన్నాను నన్ను నేను సమర్థించుకుంటూన్నట్టు!

'మీ రన్నీ అలాగే సమర్థిస్తారు! మీరే చూద్దురుగాని' అంటూ మజ్జిగపోసి లేడి పిల్లలా వెళ్ళింది పక్క వాటాలోకి! చెయ్యి కడుక్కుని లేచేసరికి రెండు చాపలు ఒకదానిపక్కన ఒకటి పెట్టి చూపించింది.

'ఏం? యిప్పుడేనా చూశారా! రెండు ఒకటే. ఒకటే సైజు ఒకటే అల్లిక ఈ కబుర్లెందుకుగాని బేరం చెయ్యకుండా తెచ్చానని చెప్పరాదూ' చంటి పిల్లాడిని డబాయించినట్లు డబాయించడం ప్రారంభించింది.

'ఓహోహోహో! చెప్తుంటే మొదటి కొస్తున్నావే! బేరం చేశాను గాబట్టే రెండు రూపాయలకు రూపాయి ముప్పావలా కిచ్చాడు తెలుసా?' అప్రయత్నంగా అబద్ధమాడేశాను ఆత్మాభిమానం రక్షించుకునేందుకు.

'బేర మాడ్డం అంటే అది కాదండీ! నాలుగు కొట్లూ తిరగాలి నాలుగు చోట్ల ధరలు వాకబు చేయాలి సరుకు చూడాలి అప్పుడు చవకగ ఉండే కొట్లో చెప్పిన ధరకి బేరం చేసి కొంచెం తగ్గించి సరుకు కొనుక్కోవాలి తెల్సిందా!' అంటూ బేరం ఎలా చెయ్యాలో నాకు బోధించసాగింది మా శ్రీమతంటే ఏమనుకున్నారు? మా తాత కన్నా రెండాకులెక్కువే చదివింది సాధింపులో!

'మీ నాన్నైనా వ్యాపారం పెట్టె అమ్మాయికోసం కదా అల్లుడొచ్చాడని అర్ధ రూపాయి తగ్గించి యిచ్చేవాడు మరి! మీ నాన్న కాదుగా యీ చాప అమ్మింది! అక్షరాలా పణిక్రమ్ముఖుని పెద్ద కొడుకు తెల్సిందా'

## అమిషా పొగరు

కహోనాప్యార్ హై, గదర్ చిత్రాలతో బాలీవుడ్‌లో అమిషాకు స్టార్‌డమ్‌తో పాటు తలబిరుసుతనం కూడా తారాస్థాయికి చేరుకుంది. విజయగర్వంతో పొగరెక్కిన అమిషా సెట్లో చీటికి మాటికి కోపాన్ని ప్రదర్శిస్తోందిట. తాజాగా 'మేరే జీవన్ సాథీ' సెట్‌లో షాట్ నచ్చకపోవడంతో నృత్యదర్శకుడు గణేష్ హెగ్డేతో గొడవ పడుతూ లేకుండా నానా బూతులు తిట్టిందట.

నై.



అంటూ ఛలోక్తి విసిరాను ఈ దెబ్బతో యిక నోరు మూస్తుందనుకుని.

'మా నాన్నే కొట్టుపెట్టే అమ్మాయిమీద ఆపేక్ష అనండి, అల్లుడుమీద ఆదరమే అనండి చాప ఊరికేనే యిచ్చేవాడు! తెలుసా!'అంటూ ఎదురు ఛలోక్తి విసిరింది.

నాకేం మాట్లాడాలో తోచలేదీసారి! ఈ రోజుల్లో ఆడవాళ్ళు మాటల్లో మగవాళ్ళని మించిపోతున్నారు.

'సరే! ఆ గొడవకేంగాని పోయి భోంచెయ్యి! రేపటినుంచి బజారు నువ్వే చేద్దువుగాని' అన్నాను గొప్పగా.

'అంతే! ఇక బజారు పనులు కూడ ఆడవాళ్ళు చెయ్యాల్సిందే! కాలం మారిపోయింది' అంటూ తన ఆడజాతికి వస్తున్న ఆధిక్యతని గూర్చి చెప్పుకుంది.

'మరే! రోజులు మారాయిగా మరి! యిక పోయి భోంచెయ్యి' అన్నాను మళ్ళీ!

'నన్ను దెప్పి పొడవడం కాదు గాని మీరే చూడండి! యింకోసారి! ఈ రెండు చాపలు ఎలా ఉన్నాయో! నే నన్నాననే దృష్టి వదిలేయండి! మీకు మీరు ఆలోచించుకుని చూడండి! ఏం? చూశారా! రెండూ ఒకటే సైజు ఒకటే పోలిక ఒకటే పొడుగు ఒకటే అల్లరి అన్ని కబుర్లెందుకు! మీకు బేర మాడ్డం చేతగాదని చెప్పరాదూ' అంటూ నా అప్రయోజకత్వాన్ని సాక్ష్యంతీసి రుజువు చేసింది.

'నిజమేనేవ్! మనం రోకరా తిన్నామన్నమాట' అంటూ మెల్లిగా అన్నాను దెబ్బతిన్నట్టు యిక ఆవిడతో వాదించి లాభం లేదని.

'సరేలే! ఏం చేస్తాం! వాళ్ళ చాప వాళ్ళకిచ్చెయ్' అంటూ ఓ చాప యివ్వబోయాను. నాకే అనుమానమేసింది. ఏ చాప వాళ్ళదో, ఏ చాప మాదో! రెండు అంత పోలికగా వున్నాయి కవల పిల్లల్లా! పక్కవాళ్ళకి చాప యిచ్చేసి భోజనానికి కూర్చుంది శ్రీమతి!

'అయితే నేను అప్రయోజకుడ్నే సుమా!' అనుకుంటూ కొత్త చాప తీసికొని వీధిలో అరుగుమీద కూర్చున్నాను.

ఇంతలోకే పక్క వాటా పరంధామయ్యగారు కూడా అంటే సదరు సుందరమ్మగారి భర్త కూడా భోంచేసి అరుగుమీద కొచ్చారు. ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకున్నాం! రోజూ ఆది మా కలవాటే! అరగంట మాట్లాడేసరికి పరంధామయ్యగారికీ ఆవులింతలు అధికమయ్యాయి. నిద్రా సూచకమని గ్రహించాను.

'పాపం! నిద్రవస్తున్నట్లుంది! లోపలికి పోదామా!' అన్నాను నేను.

'ఆ! లేద్దాం! నిన్న రాత్రి ప్రయాణంవల్ల నిద్ర లేదు!' అంటూ లేచాడాయన.

నేను లేచి చాప మూస్తుంటే ఆయన పరీక్షగా చూశాడు.

'కొత్త చాప కొన్నారేంటి?' అన్నాడాయన.

'మరేనండి! సాయంకాలమే తెచ్చాను!' అన్నాను. బిక్కు బిక్కుమంటూ యాయన దగ్గర కూడా మన అప్రయోజకత్వం వెల్లడవుతుందేమోనని.

'ఎంతక్కొన్నారు?' అనుకుంటూనే అడిగేశాడు! ఇంకేముంది! తప్పదు! ఈయన కూడా మెత్తగా చివాట్లు పెట్తాడు.

'రూపాయి ముప్పావలా!' అన్నాను.

'ఎంతా! రూపాయి ముప్పావలా! అరే! ఆశ్చర్యంగా వుందే!' అన్నాడు.

'ఏం? అలా అంటున్నారు?' అన్నాను.

'మొన్ననే నేను రెండు రూపాయలకు కొన్నాను. ఇంతే చాప. ఇదే సైజు' అంటూ తనకు మోసం జరిగిందన్నట్టు వెలిబుచ్చాడు.

'మీరు కొన్నది పెద్దదేమో నండి!' అన్నాను ఆయన్ని కొంచెం వోదారుస్తున్నట్లుగా మొహం పెడ్తూ!

'అబ్బే! అంతా ఒకటే సైజండి! మీ రే కొట్లో కొన్నారు!' అన్నాడింకా బాధ తీరక!

'పెద్ద వంతెన దగ్గర బిళ్ల కొట్టు పక్కన ఫాన్సీ షాప్ లేదండి! అందులో' అన్నాను.

'అరె! నేనూ ఆ కొట్లోనే కొన్నానే! లావుగా, నల్లగా యింగ్లీష్ మాట్లాడుతుంటాడు ఆ షావుకారేనా?' అని అడిగాడు యింకా అనుమానం తీరక!

'మరే! మరే! అక్కడేనండి' అన్నాను నేను.

'అయితే నేను మోసపోయానన్నమాట!'

'సరేలెండి! ఏం చేస్తాం? అయిపోయిందిగా!' అంటూ నేనూ లోపలికొచ్చేశాను.

'అయితే నేను ప్రయోజకున్నే సుమా!' అనుకుంటు యింట్లో మంచంమీద నడుం వాల్చాను.

ఇంతకీ నేను ప్రయోజకుణ్ణా అప్రయోజకుణ్ణా అని ఆలోచిస్తూ పడుకున్నాను. చల్లగాలికి ఎప్పుడో నిద్ర పట్టేసింది. ■

## అంత్రమాలిపై కన్నేసిన వర్మ!

ఇపుడు రాంగోపాల్ వర్మ అంత్రమాలి గురించే ధ్యానిస్తున్నాడట. ఆయన తాజా చిత్రం 'కంపెనీ'లో అంత్రమాలి ముఖ్య నాయికగా నటించిన సంగతి అందరికీ విదితమే. వర్మ అంత్రమాలి పట్ల ఎంతగా ఆకర్షితు డయ్యాడంటే ఏకంగా ఆమెతో సినిమా తీయాలన్న ఉత్సుకతతో ఉన్నాడట. అటు అంత్రమాలి కూడా రాము తనను తప్ప వేరే అమ్మాయిల వైపు దృష్టి పెట్టే అవకాశమే లేదని ధీమాగా చెబుతోంది. వర్మ కొత్త చిత్రంలో అంత్రమాలి ఊర్మిళ కన్నా ఎక్కువ రంగుల్ని ఒలకబోస్తుందేమో మరి.

